క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



రామారెడ్డి: మహా శివరాత్రి సందర్భంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం, రథోత్సవానికి హాజరు కావాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మద్దికుంట ఎంపీటీసీ రాజేందర్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, తోట లింగం, తోటరాజు, సుంకర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



నిజాంసాగర్(జుక్కల్): చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి సూచించారు. బుధవారం మాగి గ్రామ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రంలోని చిన్న పిల్లల బరువులు, ఎత్తులు పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడి టీచర్ శోభారాణి ఉన్నారు.

కేజీబీవీలో వైద్య పరీక్షలు



రామారెడ్డి: మండలం కేంద్రంలోని కేజీబీవీ వసతి గృహంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్య లక్షణాలున్న విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ సురేష్ తెలిపారు. వైద్య పరీక్షల్లో భాగంగా ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. కొందరు పిల్లలకి రక్త పరీక్షల నిమిత్తం టి-హబ్‌కి సిఫారసు చేశారు. వైద్యాధికారి సురేష్, భీమ్, ఆయుష్ సిబ్బంది శ్రీహరి, శ్రీధర్ పాల్గొన్నారు.

అయోధ్య సందర్శన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయికి చెందిన భక్తులు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో నూతనంగా నిర్మించిన రాంమందిరాన్ని సందర్శించారు. తొలిసారి అయోధ్యలో బాలరాముడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. భక్తులు అరవింద్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, దత్తు, మహేశ్, రాఘవరెడ్డి, రాకేష్ రావు, చందు, రాజు, శ్రీధర్, సుధాకర్‌రెడ్డి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

'రోటరీ' ఆధ్వర్యంలో రక్తదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మంజీరా డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 20 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని రోటరీ అధ్యక్షుడు పోలబోయిన సత్యం, కార్యదర్శి పి.రాజనర్సింహారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రోటరీ ఫౌండేషన్ చైర్మన్ నంగునూరి కాశీనాథం, పూర్వ అధ్యక్షుడు ధనుంజయ, నాగభూషణం, ప్రతినిధులు తోర్నాల సుధాకర్, గంగారెడ్డి, కై లాస్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీదేవి, వైద్యసిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ కే.సత్యనారాయణ, కరస్పాండెంట్ గురువేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంతాపం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కామారెడ్డిలో న్యాయవాది మృతి పట్ల ఎల్లారెడ్డిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం కామారెడ్డిలో సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డి మృతి చెందడంతో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నవీద్, పండరి, సతీష్, శ్రీనివాస్, గోపాల్‌రావు, సాయిబాబా తదితరులున్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 40 సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ఎన్నిసార్లు విన్నవించినా పాలకుల నుంచి కనీస స్పందన కరువైందని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంకు తొలగింపుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు.ట్యాంక్ పెచ్చులు ఊడిపోతున్నాయి. పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు ట్యాంక్ లోపల శుభ్రం చేస్తుండగా ఇనుప కడ్డీలు విరిగి పడిపోయేలా పైకప్పు పెచ్చులు కనపడుతున్నాయని తెలియజేశాడు. వాటర్ ట్యాంక్ పక్కన తహసీల్ కార్యాలయం, పలువురి ఇళ్లు ఉన్నాయి. దీంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం గురించి కాలనీవాసులు పంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వచ్చి దానిని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. తొలగించే ముందే దాని స్థానంలో మరో ట్యాంకును నిర్మించాలని వారు ప్రతిపాదించారు. కానీ అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్

విజయం కోసం పట్టుదలతో శ్రమించాలి



ఎగ్జామ్ ప్యాడ్లతో పదవ తరగతి విద్యార్థులు



తిమ్మక్‌పల్లిలో సూచనలు ఇస్తున్న కృష్ణాకర్‌రావు

రాజంపేట: హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తల్లమడ్ల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విజయం కోసం పట్టుదలతో శ్రమిస్తేనే విజయం సాధ్యమని, ఒక ప్రణాళికతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో భయం లేకుండా పరీక్షలు రాసి విజయాన్ని సాధించాలని తెలిపారు. పదవ తరగతి తర్వాత ఉండే విద్య, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు. హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు కృష్ణాకర్ రావు దంతేపల్లి రమేష్, అన్వేష్, సంపత్, హెచ్ఎం పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కామారెడ్డి రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇష్టంతో చదవాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు అన్నారు. బుధవారం తిమ్మక్‌పల్లి ఉన్నత పాఠశాలలో, చిన్నమల్లారెడ్డి బాలిక ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ స్ఫూర్తి కార్యక్రమం సందర్భంగా తిమ్మక్‌పల్లిలో సుజిత కృష్ణాకర్‌రావు, చిన్నమల్లారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ లెక్చరర్ రమేష్, సీఆర్‌పీ చిరంజీవిలు పరీక్ష ప్యాడ్‌లను బహుమతిగా అందజేశారు.

వైస్ ఎంపీపీపై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

రామారెడ్డి (ఎల్లారెడ్డి): గత నెల 9న రామారెడ్డి ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై ఏడుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతూ కామారెడ్డి ఆర్డీవోకు నోటీసులు అందజేశారు. ఎంపీపీ హైకోర్టు ఆశ్రయించి స్టే తెచ్చుకోగా, వైస్ ఎంపీపీపై బలపరీక్షను బుధవారం రామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ఎంపీపీపై నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి పది మంది ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో వైస్ ఎంపీపీ సభ విశ్వాసం పొందినట్లుగా ప్రకటించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సవిత తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: మహిళా సంఘ సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీసీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పొందుర్తి గ్రామ సంఘం సమావేశం మహిళా సంఘం అధ్యక్షురాలు సుకన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. భగత్ మహిళ సంఘం సభ్యురాలైన తేజశ్రీకి కూల్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయటానికి గ్రామ సంఘం ద్వారా రూ.3 లక్షల రుణం మంజూరు చేశారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడానికి గ్రామ సంఘం ద్వారా రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా బడి పిల్లల యూనిఫాం కుట్టడానికి ముందుకు రావాలని సూచించారు. సంఘ సభ్యులు, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ సీసీ శ్రీనివాస్

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ గంగాసాగర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు వచ్చేలా చూడాలన్నారు. డబుల్ ఓటర్లుగా నమోదై ఉంటే ఒకచోట ఓటు తొలగించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు సూచనలు చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఖాజాషరీఫ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాసాగర్

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం రూ.10లక్షల నిధులతో టాయిలెట్ల నిర్మాణ పనులను గ్రామస్తులు ప్రారంభించారు. సరిపడా టాయిలెట్లు లేకపోవడంతో మహిళా అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో గురువారం ప్రధానోపాధ్యాయులు వెంకటరమణతో కలిసి పంచాయితీ కార్యదర్శి సాయికుమార్ పనులు ప్రారంభించారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: ఈ నెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించే అంబేడ్కర్ సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అంబేడ్కర్ సంఘం నాయకులు హాజరుకావాలని కోరారు. సంఘం బలోపేతం, కార్యక్రమాల కార్యాచరణ, నూతన కమిటీలను ఎన్నుకుంటామన్నారు.

స్వయంపాలన దినోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చీనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను ఎంతగానో అలరించింది. ఏడో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. పాఠశాల హెచ్ఎంగా పి.రాకేశ్, పీఈటీగా వంశీధర్, ఇతర ఉపాధ్యాయులుగా అరవింద్, శ్రీనాథ్, తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముగిసిన చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. క్రషింగ్ ప్రారంభమై 110 రోజులు గడిచిందన్నారు. 3 లక్షల 24వేల 528 మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. క్రషింగ్ పూర్తి అయ్యే వరకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి



ఎల్లారెడ్డి: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యా శాఖాధికారి రాజు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల పాఠశాల 69వ వార్షికోత్సవ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి, మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలను తిలకించారు. జిల్లా పరీక్షల ఇంచార్జి లింగం, పీఆర్‌టీయూ నాయకులు కుశాల్, ఎంఈవో వెంకటేశం,ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సాయిబాబా, శివ నర్సింహారావు తదితరులున్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీవో రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోను విశ్వ కర్మ లోన్, ఇంటి పన్నుల వసూలు, ఆన్‌లైన్ డాటా ఎంట్రీలపై రివ్యూ తీసుకున్నారు. వేసవి కాలం కారణంగా తాగు నీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నవీన్, రజిత, ముఖీద్, ఫయాజ్ తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించిన అనంతరం క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని కనబర్చాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం ఇన్‌చార్జి సునీల్ రాథోడ్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం మండల కాంగ్రెస్ నాయకుడు జయప్రదీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లయ్యగారి ఆకాష్, ప్రజాపండరి, హుసేని, షేక్ జమాల్, అనీస్, కుర్మసాయిలు తదితరులున్నారు.

సర్దాపూర్‌లో ..



మాచారెడ్డి: మండలంలోని సర్దాపూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాసీలాల్ నాయక్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.10 లక్షలు మంజూరు చేయించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తిరుపతి, బన్సీనాయక్, రాజు నాయక్, భోజ్యా నాయక్, రవి, మోహన్ ఉన్నారు.

ఆడపిల్లలకు అండగా నిలవండి



దోమకొండలో మాట్లాడుతున్న సఖి కేంద్రం జిల్లా ఇన్‌చార్జి భారతి

దోమకొండ: ఆడపిల్లలకు అందరూ అండగా నిలవాలని సఖి కేంద్రం జిల్లా ఇన్‌చార్జి భారతి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అమ్మకం వంటి విషయాల్లో అధికారులకు సమాచారం అందించాలన్నారు. మహిళా హెల్ప్ లైన్ కోసం 181 కాల్ చేయాలని కోరారు. సఖి కేంద్రం(కామారెడ్డి)తో పాటు స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినట్లు ఆమె వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీడీవో రమేష్, ఐకేపీ ఏపీఎం రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు నిర్మల, హెచ్ఎం సుజాత,ఈజీఎస్ ఏపీవో రజని,తదితరులు పాల్గొన్నారు.

బస్ డిపోలో మహిళా దినోత్సవం

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపోలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. మహిళా కండక్టర్లకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన మహిళ కార్మికులకు డీఎం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకురాలికి సన్మానం

కామారెడ్డి టౌన్: మహిళా దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా నాయకురాలు చింతల పోశవ్వకు బుధవారం ఆర్టీసీ డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, డిపో మేనేజర్ ఇందిర, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం సరితాదేవి



పోశవ్వను సన్మానిస్తున్న న్యాయమూర్తి

మొక్కల రక్షణ బాధ్యత కార్యదర్శులదే



మోడెగావ్‌లో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్



రాఘవపల్లిలో..ఎంపీడీవో పర్బన్న

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హరితహారం మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం మోడెగావ్‌లో పల్లెప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు మొక్కలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ మహేందర్ రెడ్డి, ఏపీవో మధునాయక్, టీఏలు సంతోష్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల ఎదుగుదలపై దృష్టి సారించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాఘవపల్లి నర్సరీని బుధవారం స్థానిక ఎంపీడీవో పర్బన్న, ఎంపీవో శ్రీనివాస్ పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు ప్రతిరోజూ నీటిని పెట్టాలన్నారు. దీంతోపాటు మొక్కల బ్యాగుల మధ్య పెరిగే గడ్డిని, పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రతిరోజూ రెండుపూటలా మొక్కలకు నీటిని పట్టించాలని వారు సూచించారు. కార్యదర్శి క్రిష్ణమూర్తి ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

మొక్కలను సంరక్షించాలి

బాన్సువాడ రూరల్: జూన్ మాసంలో చేపట్టే తెలంగాణకు హరితహారం కార్యక్రమం విజయవంతం కావాలంటే ఇప్పటి నుంచే గ్రామ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన తాడ్కోల్‌లో ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతి పూట నీరు పట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతిరోజు నర్సరీలను సందర్శించాలన్నారు.

బ్యాంక్ లింకేజీని వంద శాతం సాధించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బ్యాంక్ లింకేజీని వంద శాతం సాధించాలని ఇన్‌చార్జి డీఆర్‌డీవో చందర్ నాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. చేపల పెంపకం యూనిట్లు 60 పూర్తి చేయాలన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేలా చూడాలన్నారు. మోడెగాంలో నిర్వహిస్తున్న చేపల పెంపకం ఫామ్, పాలీ హౌజ్‌ను సందర్శించారు. రైతులు పొందుతున్న లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీవో రాజిరెడ్డి, సీసీలు రాములు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ ఐకేపీ కార్యాలయంలో సమీక్ష జరుపుతున్న ఇన్‌చార్జి డీఆర్‌డీవో

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును మాఫీ చేయాలి



ఎల్లారెడ్డి: ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును మాఫీ చేయాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును చెల్లించాలని అనడం సరికాదన్నారు. కౌన్సిలర్లు నీలకంఠం, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి, ఇమ్రాన్ తదితరులున్నారు.

సైబర్ నేరస్తులతో జాగ్రత!

ఎల్లారెడ్డి: సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని సీఐ రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగ్రుక్ దివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్ నేరస్తులు ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని, ఆధార్ అప్‌డేట్ చేయాలని ఓటీపీలు చెప్పాలని మోసాలకు పాల్పడతారని అన్నారు. ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, ఎస్సై మహేష్ తదితరులున్నారు.

